సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 26 । జనవరి । 2023



ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

నెల్లిమర్ల మండలంలోని అలుగోలు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్లు విజేతలుగా నిలిచాయి.

- 8లో



ముగిసిన స్టెప్‌కాన్ జాతీయ సదస్సు

రాజాం జీఎంఆర్ ఐటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్టెప్‌కాన్-2023 జాతీయ సదస్సు బుధవారం ముగిసింది.

- 8లో

బిత్రపాడులో గజరాజులు



జియ్యమ్మవలస: బిత్రపాడు పరిసర ప్రాంతాలలో బుధవారం ఉదయం సంచరించిన ఏనుగులు.. మధ్యాహ్న సమయానికి కొమరాడ మండలం దళాయిపేట పంటపొలాల్లోకి చేరాయి. ఏనుగుల సంచారంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

న్యూస్‌రీల్

'ఆండ్ర' అభివృద్ధికి కృషి

- జైకా టీమ్ లీడర్ అనురాగ్ సిన్హా



రైతుల సమస్యలు వింటున్న అనురాగ్ సిన్హా తదితరులు

మెంటాడ: మండలంలోని ఆండ్ర జలాశయం అభివృద్ధికి మరింత కృషి చేస్తామని జైకా (జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ ఏజెన్సీ) టీమ్ లీడర్ అనురాగ్ సిన్హా తెలిపారు. ఆండ్ర జలాశయ అభివృద్ధి పనులను తన బృందంతో కలిసి బుధవారం పరిశీలించారు. జలాశయానికి ఆనుకుని ఉన్నరెండు కాలువల అభివృద్ధి పనులపై నీటిపారుదల శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆండ్ర జలాశయం అభివృద్ధి పనులకు జైకా నిధులు రూ.13.31 కోట్లు మంజూరుచేయగా, ఇప్పటివరకు రూ.11.08 కోట్ల విలువైన పనులు పూర్తిచేశామన్నారు. స్థానిక రైతులు సాగునీటి ఇబ్బందులపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట డీఈ పాండు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచూపిన దోనుబాయి విద్యార్థి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సింహాద్రి

సీతంపేట: ఇటీవల కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 పోటీల్లో బాలుర విభాగంలో దోనుబాయి ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఎ.సింహాద్రి సత్తాచూపాడు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థిని ఐటీడీఏ పీఓ నవ్య, డీడీ నగేష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, హెచ్‌ఎం సుబ్బారావు, పీడీ వెంకటరావు అభినందించారు.

రైతులకు విరివిగా రుణాలు



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ ఆనంద్

పార్వతీపురం: రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు జేసీ ఒ.ఆనంద్‌సూచించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్ వరి, ఇతర పంటల రుణ పరిమితి నిర్ధారణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల దిగుబడి, చిన్నతరహా పరిశ్రమల ఆదాయం అంచనా ఆధారంగా రుణ పరి మితి నిర్ధారణ చేయడమైందన్నారు. రైతుకు ఎంత మేరకు యూనిట్‌కు రుణాలు అందిచవచ్చు అనే అంశంపై చర్చించి రుణ పరిమితిని నిర్ధారించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యాల పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నాగార్జున, ఎల్డీఎం జేఎల్ఎన్ మూర్తి, జిల్లా సహకార అధికారి బి.సన్యాసినాయుడు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఆర్.శ్రీనివాస్, ఉద్యానవన శాఖ ఉప సంచాలకులు కె.ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, డీజీఎమ్ కేవీవీఆర్ఎస్ సత్యనారాయణ, ఏజీఎమ్‌లు ఎ. శ్రీనివాసనాయుడు, ఎం.రామకృష్ణ, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి.. యూడైస్ ప్లస్

- పాఠశాల స్థాయి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్న విద్యాశాఖ
- 2023–24 సమగ్ర శిక్ష బడ్జెట్ రూపకల్పన
- కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిధుల మంజూరుకూ యూడైస్ నివేదికలు దోహదం
- ఈ నెల 26 ఆన్‌లైన్ నమోదుకు తుది గడువు



వీరఘట్టం ఎంఈఓ కార్యాలయంలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

వీరఘట్టం: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పనలో విద్యాశాఖ నిమగ్నమైంది. యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)లో పొందుపర్చిన సమాచారం ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి. ఇందులో భాగంగానే యూడైస్ ప్లస్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. గురువారం తుదిగడువు కావడంతో విద్యాశాఖ అధికారులందరూ అదే పనిలో నిమగ్నమయ్యారు.

సెప్టెంబర్ 30వ తేదీ ప్రాతిపదిక

సమగ్ర జిల్లా విద్యా సమాచార వ్యవస్థను యూడైస్‌గా పేర్కొంటారు. 2022–23 విద్యా సంవత్సరం పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సదుపాయాల వివరాలను యూడైస్ ద్వారా సేకరిస్తారు. కేంద్ర ప్రభుత్వం యూడైస్ ద్వారా పాఠశాలల సమాచార సేకరణను 2000 సంవత్సరం నుంచి ప్రారంభించింది. ఏటా సెప్టెంబర్ 30వ తేదీని ప్రాతిపదికగా తీసుకుని యూడైస్ ద్వారా పాఠశాలల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ ఏడాది కూడా పాఠశాలల సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు విద్యాశాఖ, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా కసరత్తు ప్రారంభించాయి. ఈ వివరాల ద్వారానే స్థిరమైన అభివృద్ధి సాధ్యపడుతుంది. ఎస్‌డీజీ, పీజీఏ, నీతి ఆయోగ్‌కు సంబంధించిన అన్ని విషయాలకు యూడైస్ ప్రాతిపదికగా నిలుస్తోంది. ఈ డేటా ఆధారంగా విద్యాశాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాల నిర్వహణ, 2023–24 విద్యా సంవత్సరానికి సమగ్ర శిక్ష బడ్జెట్ రూపకల్పన వీలవుతుంది. సాధారణంగా ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక అవసరాలకు నిధుల కేటాయిస్తారు. పాఠశాలల నుంచి వచ్చే సమాచారమే నిధుల కేటాయింపునకు ప్రాతిపదికగా నిలుస్తుంది.

మన్యంలో ఇదీ పరిస్థితి...

పార్వతీపురం మన్యం జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 1735 విద్యాసంస్థల్లో 1,18,692 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తు తం విద్యాశాఖ అధికారులు ఈ సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తంచేస్తున్నారు.

పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కావాలన్నా, ఉన్న పోస్టులను రేషనలైజేషన్ చేయాలన్నా, నూతనంగా అదనపు తరగతి గదులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ర్యాంపులు, వంటగదులు, లేబొరేటరీ గదులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు ఇలా ఏది మంజూరు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ ద్వారా పంపే సమాచారాన్నే ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ సమాచారం ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీ సమగ్ర శిక్షాకు నిధులు కేటాయిస్తాయి. అందుకే యూడైస్ ప్లస్ ద్వారా సేకరించే సమాచారం కీలకంగా మారుతుంది.

వివరాలు నమోదు చేస్తున్నాం



యూడైస్ సమాచార సేకరణను హెచ్‌ఎంల సహకారంతో అనుకున్న సమయానికి పూర్తిచేస్తాం. ప్రధానోపాధ్యాయులు ఇచ్చే సమాచారం ఆధారంగానే పాఠశాలలకు నిధుల కేటాయింపు ఉంటుంది. మండల విద్యాశాఖ కార్యాలయంలో అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

– పల్లి కృష్ణమూర్తి, ఎంఈఓ, వీరఘట్టం

స్పష్టంగా ఉండాలి



యూడైస్ ప్లస్ నమోదు సమయంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. పాఠశాల సమగ్ర సమాచారం యూడైస్ ప్లస్‌లో స్పష్టంగా కనిపించాలి. ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా సమాచార సేకరణ చేపట్టాలి.

– ఎస్‌డీవీ రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

వైభవంగా .. పోలమాంబ అనుపోత్సవం



అమ్మవారి ఘటాలను వనంగుడికి తీసుకెళ్తున్న భక్తులు

- వనంగుడికి చేరిన అమ్మవారి ఘటాలు
- దారిపొడవునా ఘటాలకు పూజలు
- ఈనెల 31న మారుజాతర



చిన్నారుల మీదుగా ఘటాలతో దాటుతున్న భక్తురాలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9.45 గంటలకు గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న అమ్మవారి గద్దె వద్దకు చేరిన ఘటాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానాలయం సమీపంలో ఉన్న యాత్రాస్థలం వద్ద ట్రస్టు బోర్డుచైర్మన్ పూడి దాలినాయుడు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు గంజి కాశినాయుడు, వసంతుల భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, రెవిన్నాయుడు, పూడి, కరణం, కుప్పిలి, గిరిడ కుటుంబాల సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు ఘటాలకు పూజలు చేశారు. అమ్మవారి ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహించారు. అక్కడ నుంచి వనంగుడికి బయల్దేరిన అమ్మవారి ఘటాలకు దారిపొడవునా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చిన్నారులపైనుంచి ఘటాలను దాటించారు. యాత్రాస్థలం నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న వనంగుడికి కాలినడకన అమ్మవారి ఘటాలను తీసుకెళ్లగా వందలాది మంది భక్తులు తరలివెళ్లారు. తప్పెటగుళ్లు, మహిళల కోలాటం, డప్పువాయిద్యాలు, పోతిరాజు వేషధారణలు భక్తులను అలరించాయి. వనంగుడి వద్దకు చేరుకున్న ఘటాలను ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. వనంగుడిలో అమ్మవారి ఘటాలను ఉంచిన తర్వాత పూజారి రామారావు గుడి చుట్టూ మూడు సార్లు తిరిగి కట్టువేశారు. ఈ నెల 31వ తేదీన పోలమాంబ అమ్మవారి మారుజాతర నిర్వహించనున్నారు.

అమ్మవారి సేవలో భక్తజనం

ప్రధానాలయంలో ఉన్న పోలమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. గోముఖి నదిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి చీరలు, గాజులు, కోళ్లను చూపించి మొక్కుబడులు చెల్లించారు. ఈఓ వి.రాధాకృష్ణ భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ పి.దేవకుమార్ పర్యవేక్షణలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాలను అనుపోత్సవం రోజున కూడా కొనసాగించారు.



వేయ్.. దరువేయ్...



మహిళల కోలాట ప్రదర్శన

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన తలవరం విద్యార్థులు

వీరఘట్టం: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్, కర్నూల్ జిల్లాలో జరిగిన వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆర్.హారిక, టి.కృష్ణ అండర్-17 విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్టు హెచ్‌ఎం ఉప్పాడ అప్పారావు బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పీ.డీ మజ్జి రామకృష్ణను అభినందించారు.

సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ రాక రేపు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏకు ఈనెల 27న సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ సి.నాగరాణి రానున్నట్టు ఐటీడీఏ పీఓ బి.నవ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల హెచ్‌ఎంలు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశమవుతారన్నారు.

ఎమ్మెల్యే కళావతికి అస్వస్థత

- పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స
- వైద్య సేవల అనంతరం డిశ్చార్జ్‌చేసిన వైద్యులు
- నెలరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచన



పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ/వీరఘట్టం: అవిశ్రాంతంగా ప్రజాసేవలో నిమగ్నమైన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యం నిలకడగానే ఉందని, నెలరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు, ఆర్ఎం జె.రవీంద్రకుమార్ సూచిస్తూ డిశ్చార్జ్ చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమగ్నమయ్యారు. రాత్రీపగలు తేడా లేకుండా కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు చేరుకుని ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, పథకాల లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. నియోజకవర్గంలో 33 సచివాలయాల పరిధిలోని 102 పంచాయతీల్లో 82 రోజుల పాటు ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ క్రమంలో ఈ నెల 21న దోనుబాయిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజులుగా స్వగ్రామం వండవలో విశ్రాంతి తీసుకున్నా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందారు. ఎమ్మెల్యే కళావతి ఆరోగ్యం కుదటపడి, త్వరగా కోలుకోవాలని నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షిస్తున్నారు.

ప్రజాస్వామ్యం పరిరక్షణలో ఓటరే కీలకం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- అర్హులందరూ ఓటు హక్కు పొందాలి
- ఓటే వజ్రాయుధం అని గుర్తించాలి
- కలెక్టర్ నిషాంత్‌కుమార్



ముగ్గుల పోటీలు పరిశీలిస్తున్న కలెక్టర్

పార్వతీపురం టౌన్/పార్వతీపురం: ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటులో ఓటరే కీలక భాగస్వామి అని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పేర్కొన్నారు. పార్వతీపురం జిల్లా కార్యాలయాల సముదాయం (ఆర్‌సీఎమ్ స్కూల్)లో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలు, ఒత్తిడికి లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలన్నారు. 1950 సంవత్సరం జనవరి 25న ఎన్నికల కమిషన్ ఏర్పాటైందని, 2011 నుంచి ఏటా ఒక ప్రత్యేక అంశంతో ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని పిలుపునిచ్చారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, సంచార జాతివారు, ట్రాన్స్ జెండర్స్‌ను ఓటర్ల జాబితాలో చేర్పించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టు తెలిపారు. ముందుగా ఓటు హక్కుపై చైతన్యం కలిగిస్తూ నిర్వహించిన ముగ్గుల పోటీలను కలెక్టర్ పరిశీలించారు. విజేతలైన టి.సోమేశ్వరి, టి.ఉషారాణి, పి.సౌమ్య, ఎల్.జయంతి బృందాలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లో ఫొటో తీసుకున్నారు. వృద్ధ ఓటర్లు ఎం.శ్రీరాములు, డాక్టర్ సీహెచ్ బదిరీనాథ్, గండి చిన్నంనాయుడులను దుశ్శాలువతో సత్కరించారు.

ఉత్తమ బీఎల్‌ఓలకు ప్రశంస

ఓటర్ల నమోదు, తప్పులు లేకుండా ఓటర్ల జాబితాలు రూపొందించడంతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బూత్‌లెవెల్ అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన ఎల్.సౌజన్య, బి.సౌజన్య, కురుపాం నియోజకవర్గానికి చెందిన ఎం.రోజారాణి, సాలూరుకు చెందిన జి.సతీష్‌కుమార్‌కు ప్రశంసా పత్రాలు అందజేశారు.

కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు

కొత్తగా ఓటు హక్కు పొందిన పలువురు ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేసి వారితో ఓటు హక్కు వినియోగంపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్ల నిండిన సందర్భంగా నూతనంగా ఓటుహక్కు పొందడం ఆనందంగా ఉందని, వచ్చేఎన్నికల్లో ఓటువేసి ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వామ్యం అవుతామని కొత్త ఓటర్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, ఆర్డీఓ కె.హేమలత, తహసీల్దార్ శివన్నారాయణ, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథం, పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డుమా పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గణతంత్ర వేడుకలకు వేళాయె..



పరేడ్ రిహార్సల్స్ చేస్తున్న అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటి సారిగా నిర్వహిస్తున్న గణతంత్ర వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ శాఖల ప్రగతిని తెలియజేసేలా శకటాల ప్రదర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీస్ సిబ్బంది మార్చ్‌పాస్టను ప్రాక్టీస్ చేశారు. ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఆర్డీఓ హేమలత, డీఎస్పీ సుభాష్ తదితరులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

జాతీయ తైక్వాండో పోటీలకు అమృత వర్షిణి


అమృతవర్షిణి

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి అమృత వర్షిణి అర్హత సాధించింది. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలిలో జరగనున్న 39వ జాతీయ స్థాయి జూనియర్స్ తైక్వాండో పోటీలకు అమృత వర్షిణి ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణు గోపాల రావులు తెలిపారు. జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిప్రతిష్టలు చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


పొలంలోకి దూసుకెళ్లిన బస్సు

బలిజిపేట: పాలకొండ నుంచి బలిజిపేట వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న వారికి చిన్నచిన్న గాయాలు మినహా అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం సంభవించలేదు. పాలకొండ నుంచి బస్సు బలిజిపేట వస్తుండగా ఆనాలగోపాలరావు పొలంవద్ద అదుపుతప్పడంతో డ్రైవర్ పొలంలోకి తీసుకువెళ్లాడు. ఆ సమయంలో బస్సులో ఉన్న కళాశాల విద్యార్థులు కె.దీప, రాకేష్‌కు కాలుపై చిన్నచిన్న గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థిని చిలకలపల్లికి చెందిన ఆర్.పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రశాంత్‌కుమార్ కేసు నమోదుచేశారు.

ఈనెల 30న వైద్యాధికారి పోస్టుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రం వైద్యాధికారి పోస్టుకు ఈనెల 30వతేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకుని ఉండాలని స్పష్టం చేశారు.

జీడితోటలు దగ్ధం


దగ్ధమవుతున్న జీడితోటలు

కొత్తవలస రూరల్: మండలంలోని అర్ధాన్న పాలెం రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్–85 కొండపై జీడితోటలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం కొండ పక్కన గల డంపింగ్ యార్డులో మొదలైన మంటలు కొండపై వరకు చేరుకుని జీడితోటలు అగ్నికి ఆహుతైనట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ ఘనటలో రూ.50,000 వరకు పంటనష్టం జరిగినట్లుగా అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

నాడు నేడు నిధులు సంపూర్ణంగా వినియోగించండి

విజయనగరం అర్బన్: మన బడి నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేసేందుకు మంజూరైన నిధులను ప్రణాళికాయుతంగా సంపూర్ణంగా వినియోగించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. పాఠశాలల నిర్వాహకులు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లి ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. నాడు నేడు ఫేజ్–1లో మిగులు నిధుల వివరాలను త్వరితగతిన నివేదించాలని ఫేజ్–2లో భాగంగా చేపడుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాడు–నేడు పనుల పురోగతిలో లక్ష్యాల సాధనపై బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన ఫేజ్–2 నిధులు రూ.210 కోట్లను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. పనులు జరిగిన మేరకు బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నివేదించాలని స్పష్టం చేశారు. పనులతో పాటు పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు, ఎంఈఓలు కృషి చేయాలని సూచించారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటనలో ఎదురైన పరిస్థితులను అర్థం చేసుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. పిల్లలకు నైతిక విలువల గురించి బోధించాలని హితవు పలికారు. సమావేశంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మోటార్ వితరణ

విజయనగరం: నగరంలోని కొణిశివీధి నగర పాలక పాఠశాలకు కంచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేకే కుమార్ రూ. 35 వేల విలువైన మోటార్‌ను వితరణగా బుధవారం అందజేశారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం కస్పా హైస్కూల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన గార్డెన్‌ను ప్రారంభించారు. గార్డెన్‌కి అయ్యే ఖర్చంతా కుమార్ భరించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- బాల, బాలికల విభాగంలో సత్తా చాటిన శ్రీకాకుళం

నెల్లిమర్ల రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమితో కుంగిపోకుండా గెలుపు కోసం తిరిగి ప్రయత్నించాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నెల్లిమర్ల మండలంలోని అలుగోలు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను అలుగోలు వేదికగా నిర్వహించడం గర్వకారణమన్నారు. క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. క్రీడల్లో ప్రావీణ్యం సంపాదిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించి సొంత ప్రాంతానికి, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన శ్రీకాకుళం జట్లు

అండర్–17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కబడ్డీ పోటీల్లో బాల, బాలికల విభాగాల్లో శ్రీకాకుళం జట్లు విజేతగా నిలిచాయి. ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు తలపడ్డాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం–కర్నూలు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరగగా 54–52 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం విజయం సాధించింది. అలాగే బాలుర విభాగంలో విజయనగరం–శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో 23–43 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలవగా... విజయనగరం జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. విజేతలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములు నాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠంనాయుడు, పతివాడ సత్యన్నారాయణ, ఫెడరేషన్ కార్యదర్శి రమణ, ఎంపీడీఓ గిరి బాల, సీ నియర్ కోచ్ పతివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బాలికల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీపీటీసీ గదల సన్యాశినాయుడు, తదితరులు

ఆలిండియా బీబీ పోటీలకు జీసీఎస్‌ఆర్ విద్యార్థినులు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆలిండియా యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ సీహెచ్ కేశవనారాయణ బుధవారం తెలిపారు. ఇటీవల ఈ ఎంపికలు శ్రీకాకుళంలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో జరిగాయన్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు చెన్నైలోని బీఎస్ అబ్దుల్ రెహ్మాన్ క్రిసెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఆలిండియా లెవెల్ పోటీలు జరగనున్నాయని, ఆ పోటీల్లో కళాశాలకు చెందిన ఎం.శిరీష, బి.సుకన్య, కె.హారికాదేవి, పి.అఖిల, ఐ.లీలావతి, బి.ఓంకారేశ్వరిలు పాల్గొంటారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తంతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీలు

తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా ఆధిక్యం 248 పరుగులు

- 90 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన కరణ్ షిండే

విజయనగరం: ఆంధ్రా– అస్సాం జట్ల మధ్య జరుగుతున్న రంజీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీ 248 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న మ్యాచ్‌లో భాగంగా రెండవ రోజు బుధవారం 47 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 160 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించిన ఆంధ్రా జట్టు 112 ఓవర్లలో 361 పరుగులు చేసింది. ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మన్ కరణ్ షిండే 90 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన అస్సాం జట్టు రెండవరోజు ఆటముగిసే సమయానికి 23 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయ 62 పరుగులు చేసింది. ఆంధ్రా బౌలర్ లలిత్‌మోహన్ 13 పరుగులిచ్చి 2 వికెట్లు చేజిక్కించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో అస్సాం జట్టు 113 పరుగులు చేసిన విషయం విదితమే.


బ్యాటింగ్ చేస్తున్న ఆంధ్రా బ్యాట్స్‌మన్ కరణ్‌షిండే

మత్తు పదార్థాల విక్రయంపై నిఘా

- కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాలు

విజయనగరం అర్బన్: యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. సిగరెట్లు, పొగాకు సంబంధిత వస్తువులు అమ్మే వారు, మాదక ద్రవ్యాలు అమ్మే దుకాణాలు, ఇతర బడ్డీ కొట్లపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. జాతీయ బాలల హక్కుల కమిషన్ మాదక ద్రవ్యాల నిరోధక శాఖలు సంయుక్తంగా రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్‌పై బుధవారం తన చాంబర్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల దగ్గరలో బడ్డీకొట్లు ఉండకుండా చూడాలని 18 సంవత్సరాలలోపు వారికి సిగరెట్లు, మందు వంటివి విక్రయించకుండా చూడాలని చట్టంలోని అంశాలను దుకాణాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. పాఠశాలలు, కాలేజీల వద్ద, సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అదే విధంగా మందుల షాపు వద్ద కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా మాదక ద్రవ్యాల నిరోధక చట్టంలోని అంశాలపై అవగాహన కలిగించి నిబంధనలను ప్రదర్శనలో ఉంచాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన శరీర అవయవాలపై పడే చెడు ప్రభావాన్ని యువతకు తెలిపేలా విద్యాసంస్థల్లో అవగాహన తరగతులను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్, దిశ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ హిమబిందు, డ్రగ్స్ కంట్రోల్ ఎ.డి కె.రజిత, డీఈఓ లింగేశ్వరరెడ్డి, సర్వశిక్ష ఏపీసీ డాక్టర్ స్వామినాయుడు, జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణకుమారి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ట్రైనీ ఎస్సై విధులను అడ్డగించిన వారికి శిక్ష

బలిజిపేట: ట్రైనీ ఎస్సై పనిచేసిన లక్ష్మణరావుపై అసభ్యకరంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు ముద్దాయిలకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బొబ్బిలి జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.సరోజినమ్మ తీర్పు చెప్పారు. 2016లో బలిజిపేటలో ట్రైనీ ఎస్సైగా పనిచేసిన లక్ష్మణరావుతో పెదపెంకి గ్రామానికి చెందిన వి.శ్రావణి, వి.కల్పన, ఎం.శ్రీనులు అసభ్యకరంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించారు. ఈ సంఘటపై నమోదైన ఫిర్యాదులో విచారణ పూర్తి చేసి ముద్దాయిలను నిర్ధారించి ఏడాది పాటు జైలుశిక్ష, రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై ప్రశాంత్‌కుమార్ వివరించారు.

చెరువు కబ్జా

- సాగు రైతుల ఆందోళన
- 300 ఎకరాలకు చెరువు నీరే ఆధారమని ఆవేదన
- పనిచేస్తున్న వారి నిర్బంధం
- రంగప్రవేశం చేసిన పోలీసులు


గవర చెరువులో తాటిచెట్లు తొలగించిన దృశ్యం


పనులు చేయడానికి వచ్చిన వారిని నిర్బంధించిన రైతులు


పోలీసులకు గోడు వినిపిస్తున్న రైతులు

జామి: తరతరాలుగా సాగునీరందిస్తున్న చెరువును కబ్జా చేస్తున్నారంటూ మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెరువులో పనులు చేస్తున్న వారిని నిర్బంధించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలో పద్మనాభం మండలం పొట్నూరు గ్రామ రెవెన్యూ పరిధిలో గవర చెరువు ఉంది. చెరువు కింద కుమరాం గ్రామానికి చెందిన రైతుల ఆయకట్టు భూములు సుమారు 300 ఎకరాల వరకు ఉన్నాయి. అయితే ఆ చెరువులో కొంతమంది బుధవారం జేసీబీతో చెట్లు తొలగించి పనులు ప్రారంభించిన విషయం తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా ఘటనా స్థలానికి చేరుకోవడంతో జేసీబీ డ్రైవర్ వెనుదిరిగాడు. అక్కడికి పనులు చేయడానికి వచ్చినవారు మాత్రం ఉండడంతో వారిని, వారి కారును రైతులు నిర్బంధించారు. తరతరాలుగా తమ పంటపొలాలకు సాగునీరు అందిస్తున్న చెరువును కబ్జా చేస్తున్నారా? అని రైతులు వారితో ఘర్షణ పడ్డారు. అసలు ఈ పనులు చేయిస్తున్న యజమానులు వస్తేగాని కారును, మిమ్మల్ని వదిలే ప్రసక్తిలేదని భీష్మించారు. ఈ విషయం తెలియడంతో పద్మనాభం స్టేషన్ పోలీసులు రంగప్రవేశం చేసి జరిగిన ఘటనపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పనులు చేయడానికి వచ్చిన నలుగురిని పోలీసులు అక్కడ నుంచి తీసుకువెళ్లిపోయారు. మీకు ఏమైనా సమస్య ఉంటే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించడంతో బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

బొండపల్లి: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బొబ్బిలి రైల్వే హెచ్‌సీ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్యాసింజర్ రైలు నుంచి సుమారు 25 నుండి 30 ఏళ్ల వయస్సు గల యువకుడు గొట్లాం రైల్వే స్టేషన్ పరిధిలో జారిపడినట్లు రైలు గార్డు గుర్తించాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని గార్డు తన బోగిలో ఎక్కించుకుని చికిత్స కోసం విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన కేంద్ర ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుని శరీరంపై ముదురు నీలి రంగు టీషర్టు, జీన్ ఫ్యాంట్ ఉన్నాయి. మృతుడి దగ్గర ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆచూకీ తెలిసిన వారు బొబ్బిలి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్సై రవివర్మ కోరారు.


రైలు నుంచి జారిపడి మృతిచెందిన యువకుడు

ముగిసిన స్టెప్‌కాన్ జాతీయసదస్సు




విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్టెప్‌కాన్–2023 జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థులు స్వచ్ఛందంగా పనిచేయడానికి ఉపయోగపడిందన్నారు. తరగతి గదిలో నేర్చుకునే అంశాలకంటే బయటే ఎక్కువగా నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. స్టెప్‌కాన్ అటువంటి అవకాశాలను అందించేందుకు వేదికైందని పేర్కొన్నారు. జీఎంఆర్‌వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ మాట్లాడుతూ దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థులు విభిన్నంగా ఆలోచించి అనుకున్నది సాధించడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో స్టెప్‌కాన్ కన్వీనర్ డాక్టర్ వి.ప్రసాద్, పలువురు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రెండు రోజుల పాటు నిర్వహించిన స్టెప్‌కాన్–2023 సదస్సులో దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. టెక్ పేపర్ ప్రెజెంటేషన్ విభాగంలో 259 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో పరిశోధనా పత్రాలు సమర్పించారు. అలాగే 485 మంది విద్యార్థులు వివిధ రకాల వర్క్‌షాపులు నిర్వహించగా ప్రాజెక్టు డిజైన్ కాంటెస్ట్‌లో సుమారు 40 వినూత్న ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఇండస్ట్రీ డిఫైన్ ప్రాబ్లమ్స్ విభాగంలో 32 బృందాలు పాల్గొని తమ దైన శైలిలో ప్రదర్శనలు కనబరిచాయి. ఈవెంట్లలో జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ప్రదర్శించిన కాంట్రాప్షన్, వెబ్‌థాన్, హైడ్రాలిక్ ప్రొపల్షన్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. అలాగే చెన్నైకి చెందిన సాయిరామ్ ఐటీ విద్యార్థులు ప్రదర్శించిన రోబోవార్స్ ప్రథమ, జీఎంఆర్ ఐటీ ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి. కోయంబత్తూర్‌కు చెందిన కేపీఆర్ ఐటీ విద్యార్థులు ప్రదర్శించిన డ్రోన్ వాయేజ్ ప్రథమ, జీఎంఆర్ ఐటీ, శివాని ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రదర్శన ద్వితీయస్థానం సాధించాయి. ఆండ్రాయిడ్ స్టార్, గోకార్ట్ విభాగాలలో జీఎంఆర్ ఐటీ విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించింది. గోకార్ట్ ఓవరాల్ చాంపియన్‌ను విజయనగరానికి చెందిన ఎంవీజీఆర్ కళాశాల దక్కించుకుంది. విజేతలకు ప్రిన్సిపాల్‌తోపాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం


వేడుకలకు సిద్ధమైన పోలీస్‌పరేడ్ మైదానం


గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం ఉదయం నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టర్ సూర్యకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం ఇస్తారు. పలు ప్రభుత్వ శాఖలు ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలను ప్రదర్శించనున్నాయి. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను బహూకరించనున్నారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. గణతంత్ర వేడుకల ఏర్పాట్లను డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, రెవెన్యూ డివిజన్ అధికారి ఎంవీ సూర్యకళ, తహసీల్దార్ బంగారురాజు తదితరులు పర్యవేక్షించారు.

ఉత్తమ సేవలందించిన 399 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని ఉత్తమ సేవలందించే ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. 79 శాఖలకు చెందిన 399 మంది ఉద్యోగ, అధికారులను ఎంపిక చేసినట్టు వెల్లడించారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు అవంతి విద్యార్థులు


ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందితో కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడ స్పోర్ట్స్ కౌన్సిల్, బొబ్బిలి గోకుల్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి కుస్తీ పోటీల్లో అవంతి కళాశాలకు చెందిన ఎం.కృష్ణకాంత్ 65కిలోల విభాగంలో, ఎం.వాసుదేవరావు 77 కిలోల విభాగంలో మొదటి స్థానాన్ని కై వసం చేసుకున్నారు. యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు ఈనెల 27,28,29 తేదీల్లో మహారాష్ట్రలోని కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటనున్నారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, పీడీలు వి.వెంకటకుమార్, ఎం.ఈశ్వరరావులు బుధవారం అభినందించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210